


డోర్నకల్‌లో భారీ వర్షం

డోర్నకల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్‌లో ఆదివారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. వర్షం పడే సమయంలో ఒక్కసారిగా భారీగా ఉరుముల శబ్దాలు, మెరుపులు రావడంతో ప్రజలు ఎక్కడ పిడుగులు పడుతాయోనని భయాందోళనకు గురై బిక్కుబిక్కుమంటూ గడిపారు. దీనికి తోడు వర్షం పడే సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎన్నడు ఇలాంటి ఉరుములు, మెరుపులుతో కూడిన భారీ శబ్దాలు రాలేదని, ఒక్కసారిగా భారీ ఉరుములు, మెరుపుల శబ్దాలు రావడంతో ప్రజలతో పాటు చిన్నారులు, జంతువులు సైతం ఉలిక్కిపడ్డాయి.



మార్చి నుంచి పెండింగ్‌లోనే..

రాష్ట్రంలోని మోడల్ స్కూల్స్‌లో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు 2024-25 విద్యాసంవత్సరం మార్చి నెల నుంచి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని ఆందోళన చెందుతున్నారు. రెగ్యులర్ ఉద్యోగుల మాదిరిగానే తాము కూడా విధులు నిర్వహిస్తున్నప్పటికీ ప్రతీ నెల వేతనాల కోసం ఎదురుచూడాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. ప్రతీ నెల వేతనాలు జమ అయ్యేవిధంగా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను వేడుకుంటున్నారు. రానున్న దీపావళి పండుగను దృష్టిలో పెట్టుకొని ఉద్యోగులకు వేతనాలు విడుదల చేసే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

వేతన వేతలు

- రాష్ట్రంలో 194 మోడల్ స్కూళ్లలో పని చేస్తున్న 776 మంది సిబ్బంది
- ఏడు నెలలుగా జీతాలకు నోచుకోని చిరుద్యోగులు
- రాష్ట్ర విద్యాశాఖ అధికారులకు మెమోరాండం అందజేత
- ఈ నెల 6 నుంచి విధుల బహిష్కరణ
- దీపావళి నాటికైనా సాలరీ వచ్చేనా!?

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఆదర్శ పాఠశాల (మోడల్ స్కూల్స్)ల్లో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారు. ఏడు నెలలుగా ఉద్యోగులకు జీతాలు అందకపోవడంతో కష్టాలను ఎదుర్కొంటున్నారు. చేతిలో డబ్బుల్లేక పూటగడువడం ఇబ్బందిగా మారింది.

తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాల పరిధిలోని మోడల్ స్కూల్స్‌ల్లో ఔట్ సోర్సింగ్‌లో సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. వారికి గత ఏడు నెలలుగా వేతనాలు రాక ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నారు. దసరా నాటికైనా వేతనాలు వస్తాయని ఆశతో ఎదురు చూసినా ఉద్యోగులకు నిరాశే మిగిలింది. దీపావళి నాటికైనా వేతనాలు వస్తాయా! అని ఎదురు చూస్తున్నారు. 2018 సంవత్సరం నుంచి చాలీచాలని వేతనాలతో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఫిజికల్ డైరెక్టర్, కంప్యూటర్ ఆపరేటర్, ఆఫీస్ సబార్డినేటర్, నైట్ వాచ్‌మెన్‌లకు గత ఏడు నెలలుగా వేతనాలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి ఏడు నెలలుగా వేతనాలు రాకపోవడంతో తెలంగాణ రాష్ట్రంలో అతిపెద్ద పండుగ అయిన దసరాకు కూడా అప్పులు తెచ్చుకొని పండుగ చేసుకోవాల్సిన దుస్థితి వచ్చిందని వాపోతున్నారు. గత విద్యాసంవత్సరం మార్చినెల నుంచి 2025-26 విద్యాసంవత్సరం సెప్టెంబరు నెల వరకు వేతనాలు విడుదల చేసి దీపావళి పండుగ నాటికైనా వారి ముఖాల్లో వెలుగులు నింపాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

రాష్ట్రంలో 776 మంది ఉద్యోగులు..

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 194 మోడల్ స్కూల్స్ ఉన్నాయి. వాటిల్లో 776 మంది ఔట్ సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నారు. ఫీజికల్ డైరెక్టర్ రూ.20 వేలు, కంప్యూటర్ ఆపరేటర్‌కు రూ. 17,300, ఆఫీస్ సబార్డినేటర్, నైట్ వాచ్‌మెన్‌లకు రూ.13,500ల చొప్పున వేతనాలు చెల్లిస్తున్నారు. కానీ, గత ఏడు నెలలుగా వేతనాలు రాకపోయినప్పటికీ విధులు నిర్వహిస్తున్నామని వాపోతున్నారు. తెలుగు ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకునే పెద్ద పండుగ దసరా నాటికైనా వేతనాలు అందకపోతాయా అని ఎదురు చూసిన ఉద్యోగులకు నిరాశే మిగిలింది. దసరా నాటికి వేతనాలు రాకపోవడతో అప్పులు తెచ్చుకొని పండుగ వెళ్లదీసుకున్నామని పేర్కొంటున్నారు.

మానుకోట జిల్లాలో 32 మంది ఉద్యోగులు..

మానుకోట జిల్లా వ్యాప్తంగా ఉన్న 8 మోడల్ స్కూళ్లు ఉన్నాయి. వాటిల్లో 32 మంది ఔట్ సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నారు. ఫిజికల్ డైరెక్టర్లు- 8 కంప్యూటర్ ఆపరేటర్లు-8, ఆఫీస్ సబార్డినేటర్లు-8 నైట్ వాచ్‌మెన్‌లు-8 మొత్తం - 32 విధులను నిర్వర్తిస్తున్నారు.



తాము విధులు బహిష్కరిస్తున్నట్లు స్కూల్ ఎడ్యుకేషన్ సెక్రటరీకి మోడల్ స్కూల్ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఇచ్చిన లెటర్ (ఫైల్)

విధులు బహిష్కరణ..

గత ఏడు నెలలుగా వేతనాల కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురు చూసిన ఉద్యోగులు చేసేదిమి లేక ఈనెల 6 నుంచి విధులు బహిష్కరించారు. హైదరాబాద్‌లో రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కమిషనర్, అడిషనల్ డైరెక్టర్ మోడల్ స్కూల్, మోడల్ స్కూల్ ఎడ్యుకేషన్ సెక్రటరీలకు విధులు బహిష్కరిస్తున్నట్లు వినతి పత్రాలు అందజేశారు. ఆ నాటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా మోడల్ స్కూల్స్‌లో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు విధులు బహిష్కరించారు.

జీతాలు విడుదల చేయాలి

రఘుపతి, మోడల్ స్కూల్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి



గత ఏడు నెలల నుంచి వేతనాలు రాక కుటుంబ పోషణ భారమవుతోంది. గత విద్యాసంవత్సరం మార్చి నుంచి సెప్టెంబరు వరకు వేతనాలు రాకపోవడంతో ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నాం. ఇళ్లు గడవక అప్పులు చేసి కుటుంబాల ను పోషించుకుంటున్నాం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వేతనాలు విడుదల చేయించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

బీసీలను నట్టేట ముంచిన సీఎం

- మాజీ మంత్రి సత్యవతిరాథోడ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సత్యవతిరాథోడ్

డోర్నకల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి, వారిని మోసం చేసి నట్టేట ముంచారని మాజీమంత్రి సత్యవతిరాథోడ్ విమర్శించారు. ఆదివారం డోర్నకల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కామారెడ్డి డిక్లరేషన్ పేరిట రేవంత్‌రెడ్డి డ్రామాలాడి, బీసీలకు తీరని ద్రోహం చేశారన్నారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ స్థానిక సంస్థల్లో రాజ్యాంగ పరిమితికి లోబడి ఎన్నికలను నిర్వహించారని గుర్తు చేశారు. కేసీఆర్ మార్క్‌ను కనబడకుండా చేద్దామని చెప్పి కోర్టువేసిన ముట్టికాయలతో బొక్కబోర్ల పడ్డారని విమర్శించారు. రాష్ట్రంలో పరిపాలనను పక్కన పడేసి ముఖ్యమంత్రి నుంచి మంత్రుల వరకు సంపాదనే ధ్యేయంగా పనిచేస్తున్నారని ఆరోపించారు. మంత్రుల మధ్య కాంట్రాక్ట్ పంపకాలలో వచ్చిన గొడవలతో ఢిల్లీకి సైతం ఒకరిపై ఒకరు పిర్యాదులు చేసుకుంటూ ఢిల్లీలో తెలంగాణ పరువు తీస్తున్నారని ఆక్షేపించారు. స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్‌లో ప్రకటించిన రిజర్వేషన్లు అస్తవ్యస్తంగా ఉన్నాయని, రిజర్వేషన్‌ల కేటాయింపు విధానంలో శాస్త్రీయత లోపించిందన్నారు. గిరిజన తండాలలో బీసీలు లేనిచోట బీసీలకు, కొన్ని గ్రామాల్లో ఎస్టీలు లేనిచోట ఎస్టీలకు రిజర్వేషన్లు కేటాయించారని ఆరోపించారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీ సబ్‌ప్లాన్ కింద ఏట రూ.20 వేల కోట్లను కేటాయిస్తామని చెప్పి బడ్జెట్‌లో మొండిచేయి చూపించారన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని చెప్పిన కాంగ్రెస్ ఇప్పుడు బీఆర్ఎస్, బీజేపీలపై నిందమోపుతున్నారని మండిపడ్డారు. రిజర్వేషన్‌లపై ఢిల్లికి అఖిలపక్షాన్ని తీసుకువెళ్లకుండా ఏకపక్షంగా వ్యవహరించారన్నారు. స్థానిక సంస్థలలో ప్రజాప్రతినిధులు లేకపోవడంతో గ్రామాలలో అభివృద్ధి పనులకు నిధులు విడుదల కావడం లేదని, చిన్నచిన్న పనులను గ్రామపంచాయతీ కార్యదర్శులు తమవేతనాల నుంచి వెచ్చించి చేపడుతున్నారని చెప్పారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ చేరెడ్డి బిక్షంరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మన్యుపాట్నీ, కల్లెపు సతీష్‌గౌడ్, కందుల మధుసూదన్, బాదావత్ బాలాజీ పాల్గొన్నారు.

దిగుబడి తగ్గిన పత్తి

- అధిక వర్షాలతో నష్టం
- ఎకరాకు 6-8 క్వింటాళ్లే
- పెట్టుబడి రాని వైనం
- కిసాన్ యాప్‌పై ప్రచారం నిల్

6

బాలికపై అత్యాచారం?

పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ

కురవి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : కురవి మండలం సీరోలు పోలీస్‌స్టేషన్ పరిధిలోని తండాలో పదహారేళ్ల బాలికపై ఓ వ్యక్తి అత్యాచారానికి పాల్పడ్డట్లు సమాచారం. బాలిక బంధువులు, తండావాసుల కథనం ప్రకారం. కొన్ని రోజుల క్రితం బాలికపై అదే తండాకు చెందిన వివాహితుడైన ఓ వ్యక్తి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయం బయటకు పొక్కడంతో తండా పెద్దమనుషులు రెండ్రోజుల క్రితం పంచాయతీ నిర్వహించారు. అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి రూ.3లక్షలను జరిమానా విధించారు. అయితే పంచాయతీ నిర్వహించిన పెద్దమనుషులు రూ.70వేలు తమకు ఇవ్వాలని డిమాండ్ చేయడంతో ఈ విషయం బయటకు తెలిసింది. బాలిక బాధితురాలి కుటుంబసభ్యులు సీరోలు పోలీసులను సంప్రదించినట్లు తెలుస్తోంది. ఈ విషయమై సీరోలు ఎస్సై గంద్ర సంతోష్‌ను వివరణ కోరగా అత్యాచార విషయమై ఎటువంటి పిటిషన్ తమకు అందలేదని, ఒకవేళ జరిగింది వాస్తవమే అయితే సుమోటోగా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతామని వెల్లడించారు.

యువకుడి ఆత్మహత్య



సతీష్ (ఫైల్)

పెద్దవంగర, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన పెద్దవంగరలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై హిదాయత్ అలి తెలిపిన ప్రకారం. పెద్దవంగరకు చెందిన పొర్లు సతీష్-మమత దంపతులకు పదేళ్ల కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు వర్షిత, హర్షిత ఉన్నారు. సతీష్ (29) రోజువారి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రెండేళ్లుగా మద్యానికి బానిసై కుటుంబ బాధ్యతలను పట్టించుకోకుండా జులాయిగా తిరుగుతూ కొంతకాలంగా తల్లిదండ్రులతో కలిసి స్థానిక డబుల్ బెడ్‌రూం ఇంట్లో ఉంటున్నాడు. శనివారం ఇంట్లో ఎవరులేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సతీష్ తల్లి ఐలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు. బాధిత కుటుంబాన్ని పాలకుర్తి దేవస్థాన మాజీ చైర్మన్ రాంచంద్రయ్య శర్మ, సంజయ్, రాము, శ్రీనివాస్, లక్ష్మయ్య పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

ఆర్థికసాయం అందించిన ఎమ్మెల్యే

మండల కేంద్రానికి చెందిన సతీష్ ఉరి వేసుకుని మృతి చెందడం పట్ల పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్విని రెడ్డి సానుభూతిని ప్రకటించారు. నిరుపేద కుటుంబం కావడంతో దహన సంస్కారాల కోసం ఎమ్మెల్యే సహకారంతో స్థానిక కాంగ్రెస్ మండల నాయకుడు డాక్టర్ సంకెపల్లి రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. సతీష్ మృత దేహనికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామన్నారు. ఆయన వెంట ఉప్పలయ్య, దేవేంద్ర, లింగమూర్తి, సంపత్, సోమయ్య, వినోద్, నరేశ్, షరీఫ్, రషీద్, వెంకన్న, ఏసయ్య, రాము, సురేశ్, వీరన్న ఉన్నారు.

సమష్టి కృషితో సామాజిక సేవలు విస్తృతం

కాళోజీ వాకర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు దోలి సత్యనారాయణ



వార్షిక సమావేశంలో మాట్లాడుతున్న దోలి సత్యనారాయణ

8

గ్రామీణ క్రీడల బలోపేతానికి కృషి

- ఎస్‌జీఎఫ్ క్రీడలను యువత వినియోగించుకోవాలి
- డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్



కబడ్డీ ఆడుతున్న ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్



కొమ్ములవంచలో క్రీడాకారులతో ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్, కాంగ్రెస్ నాయకులు

నర్సింహులపేట (మహబూబాబాద్ క్రైం), అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ క్రీడల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని, స్కూల్ ఫెడరేషన్ గేమ్స్ (ఎస్‌జీఎఫ్)ను యువత వినియోగించుకొని ఉజ్వల భవిష్యత్‌కు బాటులు వేసుకోవాలని డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోతు రాంచంద్రునాయక్ అన్నారు. నర్సింహులపేట మండలంలోని కొమ్ములవంచలో జరుగుతున్న రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 బాల, బాలికల కబడ్డీ క్రీడలను చివరి రోజు ఆదివారం సందర్శించారు. క్రీడాకారులు, కోచ్‌లతో పరిచయ కార్యక్రమం అనంతరం కాసేపు కబడ్డీ ఆడి అక్కడున్న వారందరిని అలరింపచేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో గ్రామీణ క్రీడలను అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చేలా సీఎం రేవంత్‌రెడ్డి కృషిచేస్తున్నట్లు గుర్తుచేశారు. మండలంలోని కొమ్ములవంచలో రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ కబడ్డీ క్రీడలు నిర్వహించడం శుభపరిణామమన్నారు. అండర్-19 బాల, బాలికలు ఎస్‌జీఎఫ్ క్రీడలను వినియోగించుకోవాలన్నారు. రాష్ట్రస్థాయి క్రీడల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులు జాతీయ క్రీడల్లో రాణించి తెలంగాణ రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారుడు, క్రీడోత్సవాల నిర్వహణ కమిటీ అధ్యక్షుడు తేట సురేశ్, ఉపాధ్యక్షుడు చంద్రబాను, ప్రో కబడ్డీ పర్యవేక్షకులు మాధవి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు జినుకల రమేశ్, మరిపెడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజశేఖర్, ఖైదం మల్లయ్య, లక్ష్మినారాయణ గౌడ్, అమీర్‌పాషా, కాంగ్రెస్ నాయకులు, కోచ్‌లు, పీడీలు పాల్గొన్నారు.

నేడు మేడారంలో మంత్రుల పర్యటన

ములుగు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క సోమవారం పర్యటించనున్నారు. సమ్మక్క, సారలమ్మ మహాజాతర ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించనున్నారు. కాగా, స్థానిక మంత్రి సీతక్క అందుబాటులోనే ఉండగా, శ్రీనివాస్‌రెడ్డి సోమవారం ఉదయం హైదరాబాద్ నుంచి హెలీకాప్టర్ ద్వారా మేడారానికి చేరుకోనున్నారు. ఉదయం 9 గంటలకు తన నివాసం నుంచి బయలుదేరి 9.30 గంటలకు బేగంపేటకు చేరుకోనున్నారు. అక్కడ హెలీకాప్టర్ ఎక్కి 10.30 గంటలకు మేడారంలో ని హెలీప్యాడ్‌లో దిగుతారు. 10.45 గంటలకు సమ్మక్క-సారలమ్మ ఆలయాన్ని సందర్శించనున్నారు. 11 గంటలకు అభివృద్ధి పనులను పరిశీలించనున్నారు. 11.30 గంటలకు హరిత హోటల్‌లోనే సమావేశపు గదిలో రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. తిరిగి మధ్యాహ్నం ఒంటి గంటకు హైదరాబాద్‌కు వెళ్లనున్నారు.



కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ప్రభుత్వంపై బురదజల్లడం మానుకోవాలి

- కాంగ్రెస్ పాలనలోనే రాష్ట్ర అభివృద్ధి
- దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాల అమలు
- బీఆర్ఎస్, బీజేపీపై మంత్రి సీతక్క ఫైర్
- మేడారంలో ముఖ్యకార్యకర్తల సమావేశం

6

ఎల్ఐసీని బలోపేతం చేయాలి

- ఐసీఈయూ సౌత్ సెంట్రల్ జోన్ ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్



మాట్లాడుతున్న రవీంద్రనాథ్

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న సంస్కరణలతో ఎల్ఐసీ రోజురోజుకు క్షీణిస్తోందని, దాని బలోపేతం కోసం ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ (ఐసీఈయూ) సౌత్ సెంట్రల్ జోన్ ప్రధాన కార్యదర్శి టీవీఎన్ఎస్ రవీంద్రనాథ్ పిలుపునిచ్చారు. మహబూబాబాద్ ఎస్ఎస్‌వీఎల్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఐసీఈయూ వరంగల్ డివిజన్ వార్షిక మహాసభను బి.శ్రీహరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు. ప్లాటినం జూబ్లీ జరుపుకుంటున్న ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ యూనియన్ అనేక ఒడి దొడుకులు ఎదుర్కొని పోరాటాలు కొనసాగించి ఉద్యోగుల హక్కులను సాధించిందని చెప్పారు. 2004 నుంచి సర్వీస్ ట్యాక్స్, జీఎస్టీకి వ్యతిరేకంగా యూనియన్ పోరాటాల ఫలితంగా ఇన్సూరెన్స్ ప్రీమియంపై జీఎస్టీని ఎత్తివేశారని చెప్పారు. త్వరలోనే ఎల్ఐసీలో అసిస్టెంట్ల నియామకం జరగబోతుందని పేర్కొన్నారు. ఎల్ఐసీని ప్రభుత్వ రంగ సంస్థగా కొనసాగించాలంటే పోరాటాలు తప్పనిసరి అని చెప్పారు. తొలుత సంఘం వరంగల్ డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎం.ప్రభాకర్ మహాసభలో కార్యదర్శి నివేదికను వివరించారు. మహాసభను పురస్కరించుకుని పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ మహాసభలో జోనల్ సంయుక్త కార్యదర్శి తిరుపతయ్య, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు, యూనియన్ ప్రతినిధులు రేష్మ, ఏ.చంద్రశేఖర్, కె.అమ్మాజీ, కమటం స్వామి, బానోత్ సేవ్యా, మీగడ లింగన్న, బెల్లంకొండ శ్రీనివాస్, మల్లేశం, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థలతో ప్రజలకు మేలు

- ఎమ్మెల్యే మురళీనాయక్

ప్రభుత్వ రంగసంస్థలను బలోపేతం చేయడం ద్వారా ప్రజలకు మేలు జరుగుతుందని మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ చెప్పారు. ఎల్ఐసీ ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. ఎల్ఐసీని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

బీసీలను మోసం చేస్తున్న పార్టీలు



సమావేశంలో మాట్లాడుతున్న కొత్తపల్లి రవి

తొర్రూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీలకు చట్టసభలలో 42శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి చెప్తున్న మాటలు నీటిమీద రాత లేనని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. ఆదివారం తొర్రూరు పట్టణ కేంద్రంలో ఆయన మాట్లాడుతూ మూడు ప్రధాన రాజకీయ పార్టీలు అందరు అనుకూలమే అంటూ బీసీలకు 42శాతం రిజర్వేషన్ దక్కకుండా కుట్రలు చేస్తున్నాయని అన్నారు. ఓట్ల కోసం అధికారం కోసం మాత్రమే ప్రజలను మోసం చేసే పార్టీలు అనే వాస్తవాన్ని ప్రజలు గ్రహించాలన్నారు. ప్రజలను మభ్యపర్చడానికి పాలకవర్గ పార్టీలు తమ పబ్బం గడుపుకోవడానికి చేస్తున్న ఎత్తులు, జిత్తులను ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. కోటాను కోట్ల మంది ప్రజలపై సాగుతున్న దోపిడీ, అణిచివేత వివక్షతలు లేని సమాజం ఏర్పడినప్పుడే పీడిత ప్రజలకు నిజమైన ప్రయోజనం అన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు ముంజంపల్లి వీరన్న, రాములు, యాకయ్య, నవీన్, వెంకన్న, వెంకటయ్య, ఐలయ్య, కేశవులు, సంతోష్, షరీఫ్ తదితరులు ఉన్నారు.

నేడు కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలి

తొర్రూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయిపై దాడికి నిరసనగా సోమవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయ ముట్టడిని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి మంద యాకమల్లు తెలిపారు. ఆదివారం తొర్రూరు పట్టణ కేంద్రంలో ఆయన మాట్లాడుతూ పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణమాదిగ ఆదేశాల మేరకు భారతదేశ సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయిపై జరిగిన దాడిని ఖండిస్తూ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టడం జరుగుతుందన్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా, మండల, గ్రామ నాయకులు కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

దేవకమ్మకు పలువురి నివాళి


దేవకమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

చిన్నగూడూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : చిన్నగూడూరు గ్రామానికి చెందిన ప్రముఖ జర్నలిస్టులు గాడిపెల్లి మధు, శ్రీహరి, యాదగిరి, శేఖర్‌ల మాతృమూర్తి గాడిపెల్లి దేవకమ్మ శనివారం మృతి చెందగా ఆదివారం విషయం తెలుసుకున్న మానుకోట ఎమ్మెల్యే మురళీనాయక్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్, మాజీ మంత్రి సత్యవతిరాథోడ్, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమణ, డోర్నకల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గునిగంటి కమలాకర్, గునిగంటి మోహన్, గాడిపెల్లి శ్రీశైలం, గాడిపెల్లి శ్రీనివాస్, రాజేష్, చిత్తనూరి శ్రీనివాస్, నర్సయ్యలు మృతదేహం వద్ద నివాళులర్పించి, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం


బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు

మరిపెడ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : బాధిత కుటుంబానికి ఆదివారం మరిపెడ హైస్కూల్‌కు చెందిన 1987-88 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు రూ.30వేల ఆర్థికసాయం అందచేశారు. మరిపెడ బంగ్లా సీతారాంపురం కాలనీకి చెందిన ఉల్లెంగుల యాదగిరి కొద్ది రోజుల కిందట అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలిసిన యాదగిరి క్లాస్‌మేట్స్ తలకొంత అమౌంట్ సేకరించి రూ.30వేలు మృతుడి భార్యకు అందచేశారు. పూర్వ విద్యార్థులు మహబూబాబాద్ మాజీ సర్పంచ్ నెహ్రూనాయక్, కర్లపాటి మధు, నాతి కృష్ణ, డీలర్ శ్రీను, యాకుబ్‌పాషా, బాసిత్‌పాషా, నాగరాజు, కుమ్మరికుంట్ల వెంకన్న, తొట్టి వెంకన్న ఉన్నారు.

దిగుబడి తగ్గిన పత్తి

● అధిక వర్షాలతో తగ్గిన పంట ● ఎకరాకు 6-8 క్వింటాళ్లే ● పెట్టుబడి రాని వైనం ● కిసాన్ యాప్‌పై ప్రచారం నిల్

మహబూబాబాద్ అగ్రికల్చర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈ సారి పత్తి దిగుబడి బాగా తగ్గిపోయింది... జిల్లాలో అత్యధిక వర్షాలు, తుఫాన్‌లు అధిక ప్రభావంతో రోజు వర్షాలే కురియడంతో పత్తి పంట దిగుబడి దెబ్బతీసింది. పత్తి పూత, కాత, కాసిన సమయంలో కాయ పగిలి.. దూది బయటకు వచ్చిన సమయంలో వర్షాలు కురియడంతో కొన్ని మండలాల్లో దూది దెబ్బతినగా.. పూత రాలిపోయింది. మరి కొన్ని మండలాల్లో పత్తి ఎర్రబారిపోయి ఆకులు రాలిపోయి పత్తిపంట బాగా దెబ్బతింది. దాంతో 10-12 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా ఈ వర్షాల కారణంగా 6-8 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వస్తుంది. ప్రస్తుతం జిల్లాలో ముందుగా వేసిన పత్తిని తెంపుతున్నారు. మిగతా పంట దూది మరో 15 రోజుల్లో దిగుబడి వచ్చే అవకాశం ఉంది. దూది ఒక క్రాప్ మాత్రమే దిగుబడి వచ్చే అవకాశం ఉండడంతో పత్తి పంట తొలగించి మొక్కజొన్న వేసేందుకు సిద్ధమవుతున్నారు.

జిల్లాలో 84 వేల ఎకరాలకు పైగా..

మహబూబాబాద్ జిల్లాలో 84,854 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. మిర్చి వేయడం తగ్గించిన రైతులు ఈసారి పత్తి పంట వైపుకు మొగ్గు చూపారు. ఒకటి, రెండు వర్షాలకే పత్తి పంటను వేశారు. పత్తి వేసిన సమయంలో ఎండలు బాగా కొట్టడంతో వేసిన పత్తి విత్తనాలు భూమిలోనే మాడిపోయాయి. మళ్లీ రెండోసారి పత్తి విత్తనాలు వేయడం జరిగింది. చెట్లు ఎదుగుతున్న సమయంలో పూతకు వచ్చిన సమయంలో వర్షాలు మొదలై భారీ వర్షాలు కురియడంతో మొదట్లోనే పూత రాలిపోయింది. పత్తి పంటలు ఎర్రబారిపోయాయి. నీరు బాగాతోటల్లో నిలిచి ఉండడంతో జాలువారిపోయాయి. చివరకు కాయలు కాసి దూది బయటకు వచ్చిన సమయంలో మళ్లీ వర్షాలు కురియడంతో దూది తడిసిపోయి నల్లబారిపోయింది. సాధారణంగా పత్తి 10-12 క్వింటాళ్లు రావాల్సి ఉండగా అధిక వర్షాల వల్ల 6-8 క్వింటాళ్ల వరకే కేసముద్రం మండలం కల్వల, మహబూబాబాద్‌కు చెందిన రైతులు బావురుమంటున్నారు. ఇదిలా ఉండగా వర్షాలతో కలుపు విపరీతంగా పెరిగిపోయి కలుపు తీసేందుకు రైతులు నానా ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

పెట్టుబడి వచ్చేలా లేదు..

అన్ని సరిగా ఉండి పత్తి సక్రమంగా పండితే 10-12 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. కేసముద్రం, మహబూబాబాద్‌తో పాటు పలు మండలాల్లో ఎకరాకు రూ.30 వేల వరకు పెట్టుబడులు పెట్టారు. ప్రస్తుతం దిగుబడి తగ్గడంతో ఎకరాకు రూ.8 వేల వరకే వస్తుందని పత్తి రైతులు చెబుతున్నారు. పెట్టిన పెట్టుబడి కూడ దూది తెంపే కూలీలకు సరిపోతుందని, ఏమాత్రం కూడ మిగలడం లేదని, నష్టమే వస్తుందని కల్వల గాంధీనగర్‌కు చెందిన ప్రాంత రైతులు వాపోతున్నారు. మరోపక్క ఎర్రబారిపోయి ఎండిపోయిన మొక్కలకు ఐదు క్వింటాళ్ల నుంచి ఆరు క్వింటాళ్ల వరకే దిగుబడి వస్తుందని మరికొంత మంది రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

కపాస్ కిసాన్ యాప్‌పై ప్రచారం ఏదీ..?

పత్తి రైతులకు కేంద్ర ప్రభుత్వం నూతనంగా కపాస్ కిసాన్ యాప్ అనే పథకాన్ని ప్రవేశపెట్టింది. సీసీఐకి పత్తి అమ్ముకోవాలంటే పత్తి రైతులు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకుని కిసాన్ యాప్‌లో స్లాట్ బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ కపాస్ కిసాన్ యాప్‌పై జిల్లాలో తగిన ప్రచారం జరగడం లేదు. రాష్ట్రంలో ఓవైపు పత్తి కొనుగోళ్ల ప్రారంభమైన మహబూబాబాద్ జిల్లాలో మంగళవారం నుంచే ప్రచారమైందని చెప్పవచ్చు. కపాస్ కిసాన్ యాప్‌పై ప్రచారం చేసి రైతులను చైతన్యం చేసి యాప్ ప్రాముఖ్యతను తెల్పి చెప్పాలని ప్రభుత్వం ఓవైపు చెబుతున్న జిల్లాలో మాత్రం ఊపందుకోవడం లేదు. వ్యవసాయ శాఖ అధికారులు యూరియా సరఫరాలో నిమగ్నమై ఉండడంతో ఈ ప్రచారాన్ని అంతగా ఊపందుకోవడం లేదని తెలుస్తోంది. మంగళవారం కేసముద్రంతో పాటు మరో మండలంలో కపాస్ కిసాన్ యాప్‌లో ప్రచారం చేసారే తప్ప జిల్లాలో ఎక్కడ ప్రచారం జరుగలేదని తెలుస్తోంది. మహబూబాబాద్ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన టీవీలో కపాస్ కిసాన్‌యాప్‌పై ప్రచారం చేస్తున్నారు. ఏ రైతు ఎంత పత్తి వేశారో అనే సమాచారం కోసం వ్యవసాయాధికారులు క్రాప్ బుకింగ్ చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. ఆ క్రాప్ బుకింగ్ కూడ ఇప్పుడిప్పుడే ప్రారంభమైనట్లు తెలుస్తోంది. క్రాప్ బుకింగ్ పది నుంచి పదిహేను రోజులు పూర్తయితే తప్ప కపాస్ కిసాన్‌యాప్ ఊపందుకునే పరిస్థితి లేదు. ఈ యాప్‌లో పత్తి రైతులు స్లాట్ బుకింగ్ చేసుకునేందుకు ఇంకా కొన్నిరోజులు సమయం పట్టే అవకాశం కనబడుతోంది.


కేసముద్రం మండలం గాంధీనగర్ శివారులో ఎర్రబారిపోయిన ఓ రైతు పత్తి చేలు


కేసముద్రం మండలం కల్వలలో పత్తి ఏరుతున్న కూలీలు, రైతులు

దిగుబడి రాక నష్టపోతున్నా..

● దేవరబోయిన రాజు, పత్తి రైతు, కల్వల



కల్వల శివారులో మూడెకరాల్లో పత్తి పంట వేశాను. వర్షాలు బాగా కురియడం వల్ల పత్తిపంట జాలు పట్టింది. ఎర్రబారిపోయింది. ఎకరాకు రూ.30 వేలు పెట్టుబడి పెట్టాను. ఎకరాకు 8 క్వింటాళ్ల వరకే దిగుబడి వస్తుంది. వచ్చిన ఆదాయం కూలీలకు, పెట్టుబడికే సరిపోయింది. నాకు ఎలాంటి ఆదాయం రాలేదు. పత్తివేసి నష్టపోయా.

ప్రభుత్వంపై బురదజల్లడం మానుకోవాలి

● కాంగ్రెస్ పాలనలోనే రాష్ట్ర అభివృద్ధి ● దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాల అమలు ● బీఆర్ఎస్, బీజేపీపై మంత్రి సీతక్క ఫైర్

ములుగు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్, బీజేపీ నేతలు బురదజల్లడం మానేయాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క హితవు పలికారు. తప్పుడు ఆరోపణలతో పబ్బం గడుపుకోవాలనుకోవడం తగదని అన్నారు. తాడ్వాయి మండలంలోని మేడారం వనదేవతలను మంత్రి ఆదివారం దర్శించుకున్నారు. అనంతరం మహాజాతర పనులను పరిశీలించారు. ఆతర్వాత కాంగ్రెస్ ముఖ్య కార్తకర్తలతో సమావేశమయ్యారు. ప్రజా ప్రభుత్వం అందిస్తున్న పథకాలను కాంగ్రెస్ కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలన్నారు. కష్ట కాలంలో తనతో నడిచిన వారికి రుణపడి ఉంటానని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి అన్ని వర్గాల ప్రజలకు చేదోడు వాదోడుగా ఉంటోందని తెలిపారు. పేదలకు సన్న బియ్యాన్ని అందించి దేశానికే ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందించి మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. రాష్ట్ర అభివృద్ధితోపాటు పేదల సంక్షేమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎంతో కృషిచేస్తున్నారని అన్నారు. రైతును రాజును చేయాలనే లక్ష్యంతో ఏకకాలంలో రూ. 2లక్షల రుణమాఫీ చేశారని గుర్తుచేశారు. తాను మంత్రి అయినప్పటి నుంచి ఇప్పటి వరకు ములుగు నియోజకవర్గంలోని దళిత, గిరిజన వాడల్లో సుమారు రూ. 30 కోట్ల సీడీఎఫ్ నిధులతో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, కల్వర్టులు మంజూరు చేయించినట్లు తెలిపారు. రూ. 80 కోట్లతో ఏటూరునాగారంలో బస్‌డిపో, టూరిజం, పంచాయతీ రాజ్ శాఖ నుంచి సుమారు రూ. 310 కోట్లను బీటీ రోడ్లకు కేటాయించామన్నారు. రాష్ట్రాన్ని పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు కొత్తరేషన్ కార్డులు ఇచ్చిన పాపాన పోలేదని విమర్శించారు. భూమిలేని కూలీల పట్ల వివక్ష చూపారని మండిపడ్డారు. కోటీశ్వర్లను రైతుబంధు పథకాన్ని వర్తింపజేశారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదల అభ్యున్నతిని దృష్టిలో పెట్టుకుని కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను అమలు చేస్తున్నామన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తుండడంతో బీఆర్ఎస్ నేతలకు కడుపు మంటగా ఉందని అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు అశోక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్, వ్యవసాయ శాఖ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కల్యాణి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


మేడారం మాస్టర్ ప్లాన్‌ను పరిశీలిస్తున్న మంత్రి సీతక్క, పక్కన జిల్లా ఎస్పీ శబరీష్, జగ్గారావు తదితరులు

మేడిగడ్డ బ్యారేజీలోకి 1.57 లక్షల క్యూసెక్కులు

మహదేవపూర్ రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. 1.57 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 85 గేట్లను ఎత్తి, అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 2.80 మీటర్లు నమోదైనట్లు అధికారులు తెలిపారు.

ఉమ్మడి జిల్లా కరాటే పోటీలు

ములుగు టౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లా అండర్-14, 17 ఏళ్ల బాల, బాలికలకు ఈ నెల 16, 17 తేదీల్లో ములుగు జిల్లా కేంద్రంలో కరాటే పోటీలను నిర్వహించనున్నారు. ఈ మేరకు వరంగల్ జిల్లా ఎస్‌జీఎఫ్‌ఐ కరాటే క్రీడల కన్వీనర్ అజ్మీరా రాజు, జిల్లా పాఠశాలల ఎస్‌జీఎఫ్‌ఐ క్రీడల సెక్రటరీ బలుగూరి వేణు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు ములుగులోని బండారుపల్లి రోడ్డులో ఉన్న గిరిజన భవన్‌లో జరుగుతాయని పేర్కొన్నారు. ఈ నెల 16న బాలికల విభాగం, 17న బాలుర విభాగానికి పోటీలు ఉంటాయని తెలిపారు. పోటీలకు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 8500876033, 9440915293 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

దినసరి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

● సీపీఎం ములుగు జిల్లా కార్యదర్శి సాంబశివ


సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి సాంబశివ

ఏటూరునాగారం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని హాస్టల్స్, ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న దినసరి కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీపీఎం ములుగు జిల్లా కార్యదర్శి బి.సాంబశివ డిమాండ్ చేశారు. ఏటూరునాగారంలో కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మె ఆదివారం నాటికి 31వ రోజుకు చేరుకుంది. సమ్మె శిబిరాన్ని సందర్శించి న సాంబశివ కార్మికులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో పనిచేస్తున్న వర్కర్లు 31 రోజులుగా సమ్మె చేస్తుంటే, ప్రభుత్వం సమస్య పరిష్కరించకుండా నిర్లక్ష్యం వహించడం తగదన్నారు. వేతనాలు పెంచాల్సిన ప్రభుత్వం, జీవో 64ను తీసుకొచ్చి వేతనాలను తగ్గించడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. అర్హులైన కార్మికులందరికీ టైం స్కేల్ అమ లు అయ్యేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరా రు. కార్మికుల సమస్యలు పరిష్కారం కాకుంటే సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళ నలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎమ్డీ.దావూద్, జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్, రఘుపతి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టిఎల్.రవి, వర్కర్లు ఎం.నాగలక్ష్మి, భాగ్యలక్ష్మి, జయలక్ష్మి, సమ్మక్క, విజయలక్ష్మి, రాజు, సూర్యతేజ, ఇందిర, సుమలత, సాంబయ్య, శివకృష్ణ, జంపయ్య, నాగమణి, సారిబాబు తదితరులు పాల్గొన్నారు.

హక్కుల కోసం ఆదివాసీలు ఉద్యమించాలి

● కుమరం భీం వర్ధంతి సభలో ఉపేందర్


మాట్లాడుతున్న ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ కమిటీ చైర్మన్ ఉపేందర్

గోవిందరావుపేట, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : హక్కు లు, చట్టాల అమలు కోసం ఆదివాసీలు ఉద్యమించాలని ఆదివాసీ ప్రజా సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ కమిటీ చైర్మన్, తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్ అన్నారు. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని పస్రాలో ఆదివారం కుమరం భీం 85వ వర్ధంతి కార్యక్రమం మండల అధ్యక్షుడు గొంది కిరణ్ ఆధ్వర్యంలో జరగగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయ న కుమరం భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఉపేందర్ మాట్లాడుతూ షెడ్యూల్ భూభాగం రావడానికి ఆనాడే ఆదివాసీ సాయుధ యుద్ధ గోండువీరుడు కుమరం భీం నిజాం రాజ్యంపై ఉద్యమించారని అన్నారు. ఆనాటి ఉద్యమాలే అదే వాదంతో నేడు మన తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సాధించుకున్న నినాదాలైన నీళ్లు, నిధులు, నియామకాలు అనే విషయాన్ని ప్రజలు, ప్రజాస్వామికవాదులు గుర్తుంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మయ్య, ఆదివాసీ నాయకపోడ్‌దెబ్బ వ్యవస్థాపక అధ్యక్షుడు దబ్బ సుధాకర్, మాదిగ దండోరా జాతీయ నేత నెమలి నర్సయ్య, తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ ములుగు జిల్లా కమిటీ సభ్యుడు చింత క్రాంతి, ఆదివాసీ నాయకపోడ్ దెబ్బ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొల్లెం సారయ్య, ఆదివాసీ, వివిధ సంఘాల నాయకులు కూరాకుల సమ్మయ్య, దుర్గారపు వీరభద్రం, సువర్ణపాక వెంకటరత్నం, చీమల శివకుమార్, చింత వెంకటేష్, చందా మహేష్, ఈక జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ రూల్స్ అమలేవీ..?!

కొందరికే రూల్స్ పెట్టి.. చేతులు దులుపుకున్న మునిసిపల్ అధికారులు

అధికారుల తీరుపై అగ్గిమీద గుగ్గిలం అవుతున్న కాలనీ వాసులు

మరిపెడ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి గుండెకాయలాంటి బిజినెస్ సెంటర్ రాంవిలాస్ గల్లీ. ఆ గల్లీలోని రోడ్డు విస్తరణ కోసం గత ప్రభుత్వం సుమారు రూ.2 కోట్లకు పైగా వెచ్చించింది. మొదట 60పీట్ల వెడల్పుతో పనులు చేపట్టడానికి ఆ గల్లీలోని ఇళ్లకు మునిసిపల్ అధికారులు మార్కుపెట్టి పనులకు శ్రీకారం చుట్టారు. దీంతో ఆ కాలనీ వాసులు గగ్గోలు పెట్టి ఆ రోడ్డు విస్తరణకు 50ఫీట్ల వెడల్పుతో పనులు నిర్వహించుటకు ఆమోదం తెలిపారు. అందరి ఆమోదంతో పనులు చేపట్టారు. మునిసిపల్ అధికారులు పెట్టిన మార్కు వరకు కొందరు తమ ఇళ్లను కూల్చి రూ.లక్షలు ఖర్చు చేసి తిరిగి పునరుద్ధరణ చేసుకొన్నారు. ఆ గల్లీలోని నలుగురు మాత్రం ససేమీరా అంటూ మార్కుపెట్టిన రూల్స్‌ను అతిక్రమించి యథేచ్ఛగా మళ్లీ పాత పద్ధతిలోనే ఇళ్ల పునరుద్ధరణ పనులు చేస్తున్నారు. రెండు నెలల కిందట ఆ గల్లీ పనులను తనిఖీ చేసిన ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ సైతం వాళ్లను మందలించి రూల్స్ అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని మునిసిపల్ కమిషనర్, ఇంజనీర్లను ఆదేశించినప్పటికీ ఫలితం లేదని ఆ గల్లీ వాసులు వాపోతున్నారు. మాకో రూల్, డబ్బు ఉన్నోళ్లకు ఓ రూల్ ఉంటదా..? అంటూ విమర్శలు గుప్పిస్తున్నారు. వీళ్ల వల్ల రోడ్డు విస్తరణ మళ్లీ పాతకథకే చేరింది. పట్టణ ప్రజలు వాపోతున్నారు. రాంవిలాస్ గల్లీ నిత్యం జన రద్దీతో ఉంటుంది. ఈ గల్లీలోనే మోడల్ స్కూల్, జూనియర్ కాలేజీ, ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, మాంటిస్సోరి స్కూల్, ఆర్‌జేఆర్ఎం డిగ్రీ కళాశాల, శాంతి థియేటర్ తదితర సంస్థలకు వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. వాహనాలు ఎదురుపడితే తొలిగేది అతి కష్టం. దీనిని గుర్తించిన గత పాలకులు రోడ్డు విస్తరణకు శ్రీకారం చుట్టి, డ్రైనేజీ కాల్వల ఆధునీకరణ, ఫ్లడ్ లైట్స్ ఏర్పాటు దిశగా అడుగులేస్తే.. మునిసిపల్ అధికారులు రూల్స్ అతిక్రమించిన వారిపై చర్యలకు అంతా మాములుగానే చూస్తూ నటిస్తున్నారని ప్రజలు అధికారుల తీరుపై అగ్గిమీద గుగ్గిలం వలే మండిపడుతున్నారు. ఇప్పటికైనా మునిసిపల్ అధికారులు ఏం చేస్తారో వేచి చూడాల్సిందేనని జనం విమర్శలు గుప్పిస్తున్నారు.


రోడ్డు విస్తరణ రూల్స్ పాటించకుండా ఉన్న ఇళ్లు

రచనల్లో సామాజిక స్పృహ ఉండాలి

- కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి సాహిత్యం వైవిధ్యం
- 'పుంజుతోక' కవిత సంకలనం ఆవిష్కరణ సభలో అంపశయ్య నవీన్

హనుమకొండ కల్చరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): సాహిత్యం అంటేనే పాఠకుడికి సామాజిక స్పృహ కల్పించేలా ఉండాలని, పోలీస్ అధికారి అయిన శ్రీనివాస్‌రెడ్డి రచనలు వైవిధ్యంగా ఉంటూ సామాజిక స్పృహ కల్పింపజేస్తాయని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, ప్రముఖ నవలాకారుడు అంపశయ్య నవీన్ అన్నారు. ఆదివారం హనుమకొండ నయీంనగర్‌లోని వాగ్దేవి కళాశాల ఆడిటోరియంలో మిత్రమండలి ఆధ్వర్యంలో విశ్రాంత ఐపీఎస్ అధికారి కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి కలం నుంచి జాలువారిన వివిధ కవితల సంకలనం పుంజుతోక సంకలనాన్ని అంపశయ్య నవీన్ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా కాళోజీ ఫౌండేషన్ అధ్యక్షుడు నాగిళ్ల రామశాస్త్రి అధ్యక్షతన జరిగిన సమావేశంలో నవీన్ మాట్లాడుతూ.. శ్రీనివాస్‌రెడ్డి రచనలు యువతను ఆకట్టుకునేలా అభ్యుదయ భావాలతో అద్భుతంగా ఉన్నాయన్నారు. సుదీర్ఘకాలం పోలీసుశాఖలో పనిచేసిన ఆ శాఖకు సంబంధించి గాని, ఇతర అంశాలు ఏవీ ప్రస్తావించకపోవడం విశేషమనిన్నారు. నవరసాలతో కూడిన సాహిత్య సృజన చేసిన శ్రీనివాస్‌రెడ్డిని అభినందించారు.


'పుంజుతోక' కవిత సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న నవీన్ తదితరులు

ప్రాణత్యాగాలు చేస్తూ వృత్తిపరంగా సామాజిక సేవ చేస్తున్న వారే పోలీసులని పేర్కొన్నారు. సమాజాన్ని పరిశీలించి ముఖ్యంగా మానవీయ సంఘటనలపై చలించి తన అద్భుత భావాలను అక్షరరూపంలోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. సమీప భవిష్యత్‌లో శ్రీనివాస్‌రెడ్డి ద్వారా అన్ని సామాజిక అంశాలతోపాటు అభ్యుదయ రచనలు మరిన్ని రావాలని నవీన్ ఆకాంక్షించారు.

విశ్రాంత పోలీసు అధికారి కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. తనకు వరంగల్ అనేక అనుభవాలను, అనుభూతులను మిగిల్చిందని అన్నారు. ఉద్యోగ తొలినాళ్లలో ఏఎస్పీగా వరంగల్‌లోనే ట్రైనింగ్ చేసి, ఇదే జిల్లాకు ఎస్పీగా పనిచేసే భాగ్యం కలిగిందని చెప్పారు. విద్యార్థి దశ నుంచే కవితలు రాయడం అలవాటని, ఆ రోజుల్లోనే తాను రాసిన కవితలు పత్రికల్లో ప్రచురితం అయ్యాయన్నారు. పోలీసు అధికారి అయ్యాక తన ఆలోచనలను కేవలం ఒక పుస్తకానికి పరిమితం చేశారన్నారు. శ్రీశ్రీ, చలం, కాళోజీ లాంటి కవులతో పాటు సినీ దర్శకులు సత్యజిత్‌రే, బి.నర్సింగరావులాంటి వారు స్ఫూర్తినిచ్చినట్లు చెప్పుకున్నారు. అంపశయ్య నవల ద్వారా నవీన్ తనకు అత్యంత సన్నిహితులయ్యారని అన్నారు. అంపశయ్య రజతోత్సవ సభలో తాను పోలీసు అధికారిగా పాల్గొంటే.. ఇప్పుడు తన సంకలనాన్ని ఆయన ఆవిష్కరించడం గొప్ప విశేషమన్నారు. సాహిత్యం సంస్కారంతోపాటు మానవ విలువలను కాపాడుతుందన్నారు.

నాగిళ్ల రామశాస్త్రి, కాళోజీ ఫౌండేషన్ కార్యదర్శి వీఆర్.విద్యార్థి, కేయూ తెలుగు ఆచార్యుడు బన్న అయిలయ్య మాట్లాడుతూ.. శ్రీనివాస్‌రెడ్డి రచనల్లో పరిణతి కనిపిస్తోందని, వృత్తికి, ప్రవృత్తికి అంతర్యాలు ఉన్నా ఆయనకు సాహిత్యమంటే ఎంత మక్కువో తన రచనల ద్వారా చాటాడని పేర్కొన్నారు. అనేకమంది పోలీసు అధికారులు, సాహిత్యవేత్తలు పాల్గొన్న ఈ కార్యక్రమంలో సహృదయ కార్యదర్శి మల్యాల మనోహర్‌రావు వందన సమర్పణ చేశారు.

మట్టి బిడ్డల చరిత్రను ప్రచురించడం అభినందనీయం

- 'ఆంధ్రజ్యోతి' పూర్వ సంపాదకుడు కె.శ్రీనివాస్
- 'ఆరెపల్లి మట్టిబిడ్డలు' పుస్తకావిష్కరణ



'ఆరెపల్లి మట్టిబిడ్డలు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

పోచమ్మమైదాన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మట్టి బిడ్డల చరిత్రను ప్రచురించి భావితరాలకు అందించడం అభినందనీయమని సామాజిక సాహితీవేత్త, ఆంధ్రజ్యోతి పూర్వ సంపాదకుడు కె.శ్రీనివాస్ కొనియాడారు. వరంగల్ జిల్లా ఆరెపల్లిలో గల సరళి అభ్యసన కేంద్రంలో ఆదివారం సీనియర్ జర్నలిస్టు నాగబెల్లి జితేందర్ సామ్రాట్ రచించిన 'ఆరెపల్లి మట్టిబిడ్డలు' పుస్తకావిష్కరణ, అంకితోత్సవ సభ నిర్వహించారు. ఈ పుస్తకాన్ని కె.శ్రీనివాస్-గోపరాజు సుధ దంపతులకు అంకితమిస్తున్నట్లు ప్రకటించారు. ఆంధ్రజ్యోతి పూర్వ సంపాదకుడు కె. శ్రీనివాస్, ప్రజా గాయకుడు, ఎమ్మెల్సీ గోరెటి వెంకన్న ముఖ్య అతిథులుగా హాజరవగా... రిటైర్డ్ ప్రిన్సిపాల్, సాహితీవేత్త ఘంటా రామిరెడ్డి ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. అదేవిధంగా మున్సిపల్ కాంట్రాక్టు ఉద్యోగి దయ్యాల రమేష్ 'సామాజిక పొద్దు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన కె.శ్రీనివాస్ మాట్లాడుతూ.. గ్రామ స్థా యి నుంచి వచ్చిన సమాచారాన్ని తీర్చిదిద్దుతూ తాము సంపాదకులు గా మారామని అన్నారు. ప్రతీ గ్రా మంలో ఉన్న మట్టిబిడ్డల గురించి భావితరాలకు తెలియాల్సిన అవసరముందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి అన్వర్, పొట్లపెల్లి శ్రీనివాసరావు, సినీ గేయరచయిత మిట్టపెల్లి సురేందర్, విశ్రాంత ప్రొఫెసర్ బన్న అయిలయ్య, వల్లంపట్ల నాగేశ్వర్‌రావు, స్థానిక కార్పొరేటర్ జన్ను షీబారాణి-అనిల్‌కుమార్, కాంగ్రెస్ నాయకుడు బుద్దె పెద్దన్న, కన్నెబోయిన సారయ్య, దారా దేవేందర్, బీఆర్ విద్యార్థి, దయ్యాల రాకేష్‌భాను, సంగంరెడ్డి పృథ్వీ పాల్గొన్నారు.

ఆదివాసీ జీవితాల ప్రతిబింబమే మిడ్కో సాహిత్యం


మిడ్కో గ్రంథాలను ఆవిష్కరిస్తున్న మిడ్కో తల్లి జయమ్మ, ప్రముఖులు

సమగ్ర సాహిత్య ఆవిష్కరణ సభలో వక్తలు

హనుమకొండ కల్చరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కడవెండి ముద్దుబిడ్డ, భారత ఉద్యమ చరిత్రలో తనకుంటూ ప్రత్యేక స్థానాన్ని ఆపాదింపజేసుకున్న గుముడవెల్లి రేణుక (మిడ్కో) సాహిత్యం ఆదివాసీ జీవితాల ప్రతిబింబమని, యావత్ మహిళా లోకానికే రేణుక గర్వకారణమని అనేకమంది వక్తలు ప్రశంసించారు. మిడ్కో సమగ్ర సాహిత్య గ్రంథాలను ఆదివారం దొడ్డి కొమురయ్య ఫౌండేషన్ కన్వీనర్ ఆస్నాల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మిడ్కో తల్లి జయమ్మతోపాటు అనేకమంది ప్రముఖ కవులు, రచయితలు, ఉద్యమకారులు కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మిడ్కో తల్లి మాట్లాడుతూ.. రేణుక తనకు బిడ్డగా పుట్టడం ఎన్నో జన్మల పుణ్యఫలమని పేర్కొన్నారు. మిడ్కో భౌతికంగా మరణించినా.. ఆమె రచనల ద్వారా ఎప్పటికి సజీవంగా ఉంటుందన్నారు. దండకారణ్యం, ఆదివాసీ ప్రాంతంలో జరుగుతున్న అన్యాయలు, అక్రమాలను మిడ్కో తన రచనల ద్వారా సమాజానికి తెలియజేశారన్నారు. ఆమె రచనల్లో ప్రస్తావించిన సమస్యలను ప్రభుత్వం గుర్తించి పరిష్కరించే దిశగా చూడాలని కోరారు.

దొడ్డి కొమురయ్య ఫౌండేషన్ సలహాదారుడు, ప్రముఖ కవి ఏరుకొండ నర్సింహులు మాట్లాడుతూ.. వలస కూలీలపై చేసిన అధ్యయనం, విముక్తి బాటలో గ్రంథం, విలువైన పరిశోధనాత్మక రచనగా నిలిచిపోతుందన్నారు. వలస జీవుల దుఃఖం, వారి జీవిలోని చేతు అనుభవాలు మిడ్కో రచనల్లో స్పష్టంగా కనిపిస్తాయన్నారు. మిడ్కో రచనలను పెద్దఎత్తున సేకరించిన మెట్టు రవీందర్ మాట్లాడుతూ.. ఆమె కథలు భావోద్వేగాల సారాంశమని పేర్కొన్నారు. మిడ్కో 13 ఏళ్ల అనుభవం సాహిత్యంలో ప్రతిబింబింపజేసి వాస్తవ జీవితాన్ని సమాజానికి తెలియజెప్పిందన్నారు. దండకారణ్య ఉద్యమ నిర్మాత లంక పాపిరెడ్డి మాట్లాడుతూ.. మిడ్కో సమాజాన్ని అనేక కోణాల్లో విశ్లేషించిందన్నారు. ఆమె రచనల్లో బస్తర్ ప్రాంతాల్లో అఘాయిత్రాలు, ఆదివాసీల సంస్కృతి విచ్ఛిన్నం, మహిళల కష్టసుఖాలు ప్రస్ఫుటంగా ప్రతిబింబింపజేసినట్లు తెలిపారు. తెలంగాణ ప్రజాఫ్రంట్ నేత బి.రమాదేవి మాట్లాడుతూ.. మిడ్కో ఉద్యమంలో నిస్వార్థంగా పనిచేసిందని, ఆమె చదువుకుంటూనే ఆదివాసీలకు అక్షరజ్ఞానం అందిస్తూ సాయుధ పోరాటంలో భాగస్వామురాలిగా నిలిచిందన్నారు.

దొడ్డి కొమురయ్య ఫౌండేషన్ కన్వీనర్ ఆస్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ.. మిడ్కో రచనలను సమాజానికి దారిచూసే దీపస్తంభంగా అభివర్ణించారు. మల్లెపూవు నుంచి మోదుగు పూవుగా మారి అనేక కష్టసుఖాలను చవిచూసిన మిడ్కో తన సాహిత్యం ద్వారా వాస్తవ జీవితాన్ని ఆవిష్కరింపజేసిందన్నారు. ఆస్నాల విమల మాట్లాడుతూ.. చిన్నతనం నుంచే రేణుక చైతన్యవంతురాలని, ఉద్యమాల పట్ల ఆకర్షితురాలై ప్రవృత్తిపరంగా సాహిత్యం ద్వారా సున్నితమైన అనుభవాలను అక్షరీకరించినట్లు పేర్కొన్నారు. మరొక ప్రముఖ కవి జిలుకర శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రస్తుత రాజకీయ వ్యవస్థలో సమసమాజం సాధ్యమవ్వాలంటే మార్పు ద్వారానే సాధ్యమని దానికి మిడ్కో జీవితం ఆదర్శనీయమన్నారు. గోరెటి అరుణ, సీపీఐ ఎంఎల్ నాయకుడు అప్పారావులతోపాటు అనేక మందిసాహితీ వేత్తలు, కడవెండి గ్రామస్థులు, అభిమానులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మిడ్కోకు సమావేశం ఘన నివాళులర్పించింది.

రక్తదానం.. సామాజిక బాధ్యత..

- పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- క్రెడాయ్ ఆధ్వర్యంలో 520 యూనిట్ల రక్తం సేకరణ



రక్తదాన శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, వేదికపై మేయర్ సుధారాణి, కమిషనర్ చహత్ బాజ్‌పాయ్, కుడా చైర్మన్ వెంకట్రాంరెడ్డి

వడ్డెపల్లి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): రక్తదానం సామాజిక బాధ్యత అని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. క్రెడాయ్ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, వరంగల్ ఎంజీఎం సంయుక్తంగా ఆదివారం హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లోని డాక్టర్ నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయనతోపాటు మేయర్ గుండు సుధారాణి, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్‌బాజ్‌పాయ్, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ శిబిరంలో 520 యూనిట్లకు పైగా రక్తం సేకరించారు. క్రెడాయ్ వరంగల్ అధ్యక్షుడు నాయిని అమరేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శాకమూరి అమర్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రక్తదానం ప్రాణదానంతో సమానమని అన్నారు. సమాజంలోని ప్రతీ ఒక్కరు రక్తదానం చేయడానికి ముందుకు రావాలని కోరారు.

మేయర్ సుధారాణి మాట్లాడుతూ.. రక్తదానం చేయడంతో ఎదుటి వారికి ప్రాణం పోసిన వారమవుతారని అన్నారు. రక్తదాతలకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కాజీపేట ఏసీపీ పింగిళి ప్రశాంత్‌రెడ్డి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యులు ఈవీ శ్రీనివాసరావు, క్రెడాయ్ చైర్మన్ తిరుపతిరెడ్డి, ప్రెసిడెంట్ ఎలక్ట్ శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షులు ఎం.రవీందర్‌రెడ్డి, ఎల్.రజినీకాంత్‌రెడ్డి, జి.రాజేందర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీలు కొండా రెడ్డి, నాగరాజు, వెంకటమల్లారెడ్డి, కోశాధికారి వరుణ్ అగర్వాల్, ఈసీ సభ్యులు రిషిన్‌రెడ్డి, మనోహర్, సందీప్, బాబురావు, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నేత గట్టు మహేష్‌బాబు, వాకర్స్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ తడక కుమారస్వామి గౌడ్, నన్నెసాహెబ్, బూర గాంధీ, బంక సంపత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా డీసీసీ అధ్యక్షుల ఎంపిక

- అభ్యర్థుల గురించి క్షేత్రస్థాయిలో పరిశీలన
- ఏఐసీసీ పరిశీలకుడు నవజ్యోతి పట్నాయక్

హనుమకొండ సిటీ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా ఉంటుందని ఏఐసీసీ పరిశీలకుడు నవజ్యోతి పట్నాయక్ వెల్లడించారు. ఆదివారం సాయంత్రం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణి తదితరులతో కలిసి మాట్లాడారు. హనుమకొండ, వరంగల్ జిల్లాల నూతన అధ్యక్షుల ఎంపిక ప్రక్రియ ప్రారంభించినట్లు తెలిపారు. తొలి రోజు ఆదివారం డీసీసీ భవన్‌లో దరఖాస్తుల స్వీకరణ జరిగిందని, ఈ నెల 18 వరకు కొనసాగనున్నట్లు చెప్పారు.

పార్టీ బలోపేతం కోసం అగ్రనేత రాహుల్‌గాంధీ విప్లవాత్మక సంస్కరణలు తీసుకొస్తున్నారని నవజ్యోతి పట్నాయక్ చెప్పారు. భారత్ జోడో యాత్ర ఇందులో ఒకటిగా చెప్పారు. పార్టీని గ్రామ స్థాయి నుంచి పటిష్ఠంగా నిర్మించడం, నాయకత్వ ఉత్పత్తి, పార్టీ పదవుల ఎంపికలో నిర్దిష్ట విధానాల రూపకల్పన, అమలు వంటివి ప్రవేశపెట్టామన్నారు. 'సంఘటన్ శ్రీజన్ అభియాన్' పేరుతో పార్టీ పునర్‌నిర్మాణం చేపడుతున్నట్లు వివరించారు. ఈ మేరకు డీసీసీ అధ్యక్షుల ఎంపిక ఉంటుందన్నారు. పారదర్శకత, నిబద్ధత, నాయకత్వ సామర్థ్యం, పార్టీకి చేసిన సేవలు, తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని అధ్యక్ష పదవి ఎంపిక జరుపనున్నట్లు చెప్పారు. అభ్యర్థుల గురించి క్షేత్రస్థాయిలో వివిధవర్గాల నుంచి అభిప్రాయాల సేకరణ కూడా ఉంటుందన్నారు.

కాగా, డీసీసీ అధ్యక్ష పదవుల ఎంపికలో భాగంగా జిల్లాలో సమావేశాలు నిర్వహించనున్నట్లు పట్నాయక్ తెలిపారు. 13న డీసీసీ భవన్‌లో జిల్లా ముఖ్య నేతలు, ప్రజా ప్రతినిధులతో సమావేశం, 14న పరకాల నియోజకవర్గ పరిధిలో సమీక్ష, 16న వరంగల్ తూర్పు నియోజకవర్గ సమావేశం, 17న వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలో సమావేశ నిర్వహణ, 18న నర్సంపేట నియోజకవర్గ నేతలతో సమావేశం నిర్వహించి పర్యటనను ముగించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు ఈవీ శ్రీనివాస్, బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, టీపీసీసీ నాయకులు బత్తిని శ్రీనివాస్, జీడబ్ల్యూఎంసీ ఫ్లోర్ లీడర్ తోట వెంకన్న, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు పింగళి వెంకట్‌రెడ్డి, ఓబీసీ సెల్ అధ్యక్షులు బొమ్మతి విక్రమ్, కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, ఏఎంసీ చైర్మన్ ఝాన్సీరాణి, తెలంగాణ ఫిషరీస్ కాంగ్రెస్ కమిటీ సభ్యులు మండల సమ్మయ్యతో పాటు కూర వెంకట్, శ్రవణ్, సాగరిక, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్ష దరఖాస్తులు ప్రారంభం

హనుమకొండ సిటీ : డీసీసీ పదవి కోసం అభ్యర్థులు సమర్పించిన దరఖాస్తులను ఏఐసీసీ పరిశీలకుడు నవజ్యోతి పట్నాయక్ స్వీకరించారు. హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివారం నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. ఈ నెల 18 వరకు కొనసాగనుంది. ఇందులో భాగంగా తొలిరోజు కొందరు అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఏఐసీసీ పరిశీలకుడు పట్నాయక్ అభ్యర్థుల నుంచి దరఖాస్తుల స్వీకరిస్తూ వారి వివరాలను తెలుసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న వారిలో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు పింగళి వెంకట్రాంరెడ్డి, ఓబీసీ సెల్ చైర్మన్ బొమ్మతి విక్రమ్, కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, మోజెస్ ఆనంద్, మార్క విజయ్ తదితరులు ఉండగా, మహిళలో హనుమకొండ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళా తదితరులు ఉన్నారు. తొలి రోజు ఆదివారం తక్కువ సంఖ్యలో దరఖాస్తుల సమర్పణ జరిగింది. రానున్న రోజుల్లో ఆశావహుల సంఖ్య పెరగనున్నట్లు అంచనాలు ఉన్నాయి.


నవజ్యోతి పట్నాయక్‌కు దరఖాస్తు ఇస్తున్న నాయకుడు మార్క విజయ్

తెలంగాణ 'దీప్తి' పతాక..!

- మళ్లీ ప్రపంచ వేదికపై జీవాంజి కీర్తి పతాకం
- ఆస్ట్రేలియాలో బంగారు పతకం సాధించిన అథ్లెట్
- 55.92 సెకండ్లలో 400 మీటర్ల పరుగు ఛేదన
- అభినందిస్తున్న ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు

పర్వతగిరి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పారా అథ్లెటిక్స్ పోటీల్లో బంగారు పతకం సాధించిన వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని కల్లెడ గ్రామానికి చెందిన జీవాంజి దీప్తి.. ఆస్ట్రేలియాలోని బ్రిటన్‌లో తాజాగా మరో బంగారు పతకాన్ని సొంతం చేసుకుంది. విర్ట్యూస్ వరల్డ్ అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ -2025లో 400 మీటర్ల పరుగు పందెంలో 55.92 సెకండ్లలో లక్ష్యాన్ని ఛేదించి మొదటి బహుమతి గోల్డ్ మెడల్ సాధించింది. రెండో రన్నరప్‌గా పోర్చుగల్ దేశానికి చెందిన సరేనా పైరమ్ 58.86 సెకండ్లలో పూర్తి చేయగా, మూడో రన్నరప్‌గా 59.09 సెకండ్లలో ఆస్ట్రేలియాకు చెందిన బ్లాక్ స్మిత్ నిలిచింది.

ఒలింపిక్స్‌లో పతకాల పంట

2022లో హ్యాంగ్ జౌ ఆసియా పారా గేమ్స్‌కు ఎంపికై, 2023 అక్టోబరు 24న జరిగిన టీ20 అవెంట్‌లో 400 మీటర్ల పరుగులో థాయిలాండ్‌కు చెందిన ఒరవన్ క్రైసింగ్ కంటే ముందు 56.69 సెకన్లలో చేరుకుని బంగారు పతకం సాధించింది. గతంలో అమెరికా క్రీడాకారిణి బ్రెన్న క్లార్క్ రికార్డును సైతం బద్దలు కొట్టింది. 2024 జపాన్ కోబ్‌లో జరిగిన ఒలింపిక్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించి ఉమెన్స్ టీ20 కేటగిరీలో 400 మీటర్ల పరుగు పందెంలో కేవలం 55.07 సెకండ్లలో పూర్తి చేసి బంగారు పతకం సాధించి మొట్టమొదటి అథ్లెటిక్‌గా నిలిచింది. ప్రపంచ పారా ఒలింపిక్స్‌లో ఎన్నో పతకాలు సాధించిన జీవాంజి దీప్తి ప్రతిభను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం.. అర్జున అవార్డుకు ఎంపిక చేసింది. 2024 జనవరి 2న భారతి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డు అందించగా, ప్రధాన నరేంద్ర మోదీ సైతం సత్కరించారు.

హర్షం వ్యక్తం చేస్తున్న ప్రముఖులు

జీవాంజి దీప్తి మరోసారి అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించడంతో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అభినందించారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఆర్డీఎఫ్ పాఠశాల వ్యవస్థాపకుడు ఎర్రబెల్లి రామ్మోహన్‌రావు సైతం దీప్తి విజయం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. తెలంగాణ ఖ్యాతిని, పర్వతగిరి మండల పేరును ప్రపంచ స్థాయిలో వినిపిస్తున్న జీవాంజి దీప్తికి ఎల్లప్పుడు రాష్ట్ర ప్రజలు రుణపడి ఉంటారని స్పష్టం చేశారు.


రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి అర్జున అవార్డు అందుకుంటున్న జీవాంజి దీప్తి (ఫైల్)

జోరుగా మాంసం విక్రయాలు

- ప్రజల ఆరోగ్యంతో చెలగాటం
- రోడ్లపైనే అమ్మకాలు
- నిబంధనలు బేఖాతరు
- పట్టించుకోని అధికారులు

నర్సంపేట టౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): శారీరక ఆరోగ్యం కోసం వైద్యులు మాంసాహారాన్ని తినాలని సూచిస్తారు. కానీ, ప్రస్తుతం మాంసం తింటే రోగాల బారిన పడే అవకాశాలు నర్సంపేట పట్టణంలో నెలకొన్నాయి. మునిసిపాలిటీ పరిధిలో 14 మాంసం విక్రయ కేంద్రాలు అనుమతి పొందాయి. ద్వారకాపేట సెంటర్‌లో 2, కమలాపూర్ క్రాస్ వద్ద 2 అనధికారికంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం వచ్చిందంటే దాదాపుగా 3 క్వింటాళ్లకు పైగా అమ్మకాలు జరుపుతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు మాంసం కొనుగోలుకు నర్సంపేటకు వస్తుంటారు.

జనావాసాల్లో జీవాల వధింపు

పట్టణ, గ్రామీణ ప్రజలు గొర్రెలు, మేకల మాంసం ఎక్కువగా వినియోగిస్తుంటారు. ఆదివారం వచ్చిందంటే మాంసం దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడుతాయి. ఈ విక్రయాలపై దృష్టి పెట్టాల్సిన మునిసిపల్ ప్రజారోగ్య అధికారులు వాటిమాటే మరిచిపోయారు. నిబంధనల ప్రకారం గొర్రె, మేకలను పరీక్షించి ముద్ర వేయాలి. కొన్ని నెలలుగా ముద్ర వేయకుండానే మాంసం విక్రయిస్తున్నారు. కబేళాలో వధించి మాంసం విక్రయించాలి. కానీ, కొంత మంది నిర్వాహకులు మాత్రం ఇళ్లు, రోడ్లపై వధించి మాంసం విక్రయాలు కొనసాగిస్తున్నారు. జనావాసాల్లో జంతువులను వధించడం వల్ల వాటి వ్యర్థాలను నివాసిత ప్రదేశాలు, డ్రెయినేజీల్లో వేయడం వల్ల ప్రజారోగ్యంతో పాటు పర్యావరణానికి ముప్పు వాటిల్లుతోంది. జీవాలను వధించే సమయంలో పశు వైద్యాధికారులు అందుబాటులో లేక పోవడంతో ఎలాంటి గొర్రె, మేకల మాంసం విక్రయిస్తున్నారో తెలియడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


రోడ్డు పక్కనే మాంసం విక్రయిస్తున్న దృశ్యం

రోడ్లపైనే విక్రయాలు

నర్సంపేట పట్టణంలో మటన్ మార్కెట్ లేకపోవడంతో ప్రధాన రహదారికి ఇరువైపుల గల షెటర్లలో మాంసం విక్రయిస్తున్నారు. రహదారులపై దుమ్ము ధూళి మాంసంపై పడుతుంది. అదే మాంసాన్ని నిర్వాహకులు ప్రజలకు విక్రయిస్తున్నారు.

నిబంధనలకు తూట్లు

మాంసం విక్రయదారులు మునిసిపాలిటీకి ఫీజు చెల్లించి తప్పనిసరిగా అనుమతి పొందాలి. ద్వారకాపేట సెంటర్‌లో 2, కమలాపూర్ క్రాస్ వద్ద 2 విక్రయ కేంద్రాలు మాత్రం ఎలాంటి అనుమతి లేకుండా రోడ్లపై మాంసం విక్రయాలు చేస్తున్నారు. ఈ షాపులపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వెనక ఉన్న అంతర్యం ఏమిటో అని ప్రజల్లో చర్చ జరుగుతోంది.

ఈ విషయమై మునిసిపల్ కమిషనర్ కాటా భాస్కర్‌ని వివరణ కోరగా.. రహదారులు, జన ఆవాసాల మధ్యలో జంతువులను వధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మాంసం విక్రయాలను పరిశీలించి నిబంధనలు పాటించని వారికి నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

మూగబోతున్న సైకిల్ బెల్

- తగ్గుతున్న వాడకం
- ఇంధన వాహనాల మోజులో యువత
- జ్ఞాపకంగా మిగిలిపోనున్న సైకిల్


నల్లబెల్లి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): నేటి ఆధునిక కాలంలో సైకిల్ వినియోగం తగ్గుముఖం పట్టింది. సైకిల్ బెల్ శబ్దం కనుమరుగవుతోంది. ఒకప్పుడు పేద, మధ్య తరగతి ప్రజలకు రవాణా సౌకర్యంగా పని చేసిన సైకిల్ వాడకం క్రమంగా తగ్గుతోంది. పెరిగిన సాంకేతికతో ఇంధన వాహనాలపై ప్రజలకు మోజు పెరిగింది. నేడు ప్రతి పనికి ద్విచక్ర వాహనాలపైనే వెళ్తున్నారు. శరీరానికి శ్రమ లేకుండా పోయింది. దీంతో సైకిల్ వినియోగం తగ్గడంతో మనుషులు అనారోగ్యం బారిన పడే వారి సంఖ్య పెరిగింది.



కానరాని సైకిల్ బెల్ 'ట్రింగ్.. ట్రింగ్' మోత

గ్రామాల్లో, పట్టణాల్లో నాడు సైకిల్ బెల్ 'ట్రింగ్.. ట్రింగ్' మనే శబ్దాలు మోగేవి. రైతులు పొలం పనులకు వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు పశుగ్రాసం తీసుకొని తిరిగి ఇంటికి తేచ్చేందుకు సైకిల్ ఎంతో ఉపయోగపడేది. పొద్దునే చిరు వ్యాపారులు తాజా కూరగాయలు, పాలను తీసుకొని ఊరూరా తిరుగుతూ ఉండేవారు. సైకిల్ బెల్ శబ్దం వినగానే మహిళలు బయటకు వచ్చి కూరగాయలు, పాలను తీసుకునేవారు. అప్పట్లో ట్రింగ్ ట్రింగ్ మనే శబ్దం గ్రామాలు, పట్టణాల్లో నిత్యం వినిపించేది. దూరప్రాంతాలకు వెళ్లేందుకు సామాన్యులు ఎక్కువగా సైకిల్‌నే వినియోగించేవారు. కాలుష్య రహిత, పర్యావరణ హిత సైకిల్ వాడకం మంచిదని, పేదలు, చిరు వ్యాపారులు, విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు అందించి వారిని ప్రోత్సహించాలని పలువురు కోరుతున్నారు.

సైకిల్ ఎంతో ఉపయోగపడేది..



వ్యవసాయ పనులకు, బావుల వద్దకు వెళ్లడానికి సైకిల్ ఎంతో ఉపయోగపడేది. సైకిల్‌తో ఎలాంటి ప్రమాదం లేకుండా నెమ్మదిగా గమ్యాన్ని చేరుకోవచ్చు. గడ్డి, ఎరువులు, పొయ్యిల కట్టలను సైకిల్‌పైనే తీసుకువచ్చేది. అంతేకాక, సైకిల్ తొక్కడం వల్ల ఆరోగ్యంగా ఉండేవాళ్లం.

- రైతు అజ్మీరా భీమ్, రుద్రగూడెం

గీత కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

● కేజీకేఎస్ జిల్లా నాయకులు

కేసముద్రం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : గీత కార్మికులకు ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని కల్లుగీత కార్మిక సంఘం (కేజీకేఎస్) జిల్లాఅధ్యక్ష, కార్యదర్శులు యమగాని వెంకన్న, గౌని వెంకన్న, చిలువేరు సమ్మయ్యగౌడ్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేసముద్రంలో ఆదివారం ఆ సంఘం ఐదో మండల మహాసభ నిర్వహించారు. ఈ సభలో వారు మాట్లాడుతూ ప్రమాదాల్లో గాయపడిన, మరణించిన గీత కార్మికులకు, వారి కుటుంబాలకు రావాల్సిన పరిహారాన్ని మంజూరు చేయాలన్నారు. గీత కార్మికులకు సంక్షేమపథకాల్లో ప్రధాన్యత కల్పించాలన్నారు.

కేజీకేఎస్ నూతన కమిటీ ఎన్నిక..

మహాసభ అనంతరం కేజీకేఎస్ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా బబ్బురి ఉప్పలయ్య, ఉపాధ్యక్షులుగా మేడి వెంకటేశ్వర్లు, వంగ సంపత్, కార్యదర్శిగా మోడెం వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శులుగా జోగు రవీందర్‌తో పాటు సభ్యులుగా కదిర సోమయ్య, బుర్ర వెంకన్న, రాంపల్లి వెంకన్న, చిర్రగోని సాయిలు, ప్రభాకర్, వీరన్న, ఎల్లయ్య, సోషల్ మీడియా కన్వీనర్‌గా కుమారస్వామి, కోకన్వీనర్‌గా వంశీలను ఎన్నుకున్నారు.



గుంతలమయంగా మారిన భూపతిపేట నుంచి భీమునిపాదం వెళ్లే రోడ్డు



గూడూరు నుంచి భీమునిపాదం వెళ్లే గుంతలమయంగా మారిన రహదారి

రాళ్లు తేలిన రోడ్లు.. నోళ్లు తెరిచిన గుంతలు

● రహదారిపై నడువడానికి ఇబ్బంది పడుతున్న ప్రజలు

● వాహనదారుల నరక యాతన

గూడూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఆ గుంతల రోడ్లపై ప్రయాణం సాగించేందుకు వాహనదారులు ప్రతినిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. తారు పోయి వాహనదారుల ఒళ్లు హూనం చేస్తున్నాయి. గూడూరు నుంచి భీమునిపాదం, భూపతిపేట నుంచి భీమునిపాదం వెళ్లే రహదారులు అధ్వానంగా మారాయి. చిన్నపాటి వర్షం పడితే గుంతల్లో నీరు నిలిచి, బురదమయంగా మారుతున్నాయి. రోడ్లపై ఏర్పడిన గుంతలు ప్రయాణికులు, పర్యాటకులకు యమపాశంగా మారాయి. ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సి వస్తుంది. ఆ రెండు దారులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. వాహనదారులు తరుచుకిందపడుతూ.. గాయాలపాలవుతున్నారు.సంవత్సరాలు గడుస్తున్నా.. ప్రభుత్వం వాటిని బాగు చేయకపోవడంతో ప్రజలు నిత్యం నరకం చూస్తున్నారు. భీమునిపాదంకు చూసేందుకు వివిధ జిల్లాల నుంచి పర్యాటకులు వస్తుండడంతో ఈ దారి వెంట వెళ్లేందుకు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భీమునిపాదంకు వెళ్లే రెండు దారులను తారు, సీసీ రోడ్డు ఏర్పాటు చేస్తే భీమునిపాదంకు పర్యాటకుల తాకిడి పెరిగే అవకాశం ఉంది. భూపతిపేట నుంచి సీతానగరం, కొమ్ములవంచ, భీమునిపాదం, గూడూరు నుంచి లైన్‌తండా, వంపుతండా, గ్రామాల ప్రజలు సైతం ఈ దారుల వెంట నిత్యం రాకపోకలు కొనసాగించాలంటే ఇబ్బందులు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు భీమునిపాదం వెళ్లే ఆ రెండు రహదారులను కొత్తగా తారు, సీసీ వేసేందుకు నిధులు కేటాయించి పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శిగా శ్రీనివాస్



మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ మునిసిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి మానుకోట పట్టణానికి చెందిన కాంపల్లి శ్రీనివాస్ తిరిగి నియామకమయ్యారు. మహబూబాబాద్‌లో ఆదివారం నిర్వహించిన మహాసభలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుల రాజు, కుంట ఉపేందర్ సమక్షంలో యూనియన్ జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కొమ్ము దేవేందర్, కోశాధికారిగా జాటోతు మంగిలాల్‌ను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా గుర్రాల పుష్పరాజు, ఆవుల వీరన్న, తప్పెట్ల శ్రీకాంత్, కడారి రామస్వామి, సహాయ కార్యదర్శులుగా పుచ్చకాయల లక్ష్మి, కందుకూరి శ్రీను, పుచ్చకాయల మంజుల, ఇద్దరు కోఆప్షన్ మెంబర్లతో పాటు మరో 17 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక



సత్యనారాయణ కార్యదర్శి



వెంకన్న అధ్యక్షుడు

గూడూరు, అక్టోబరు12 (ఆంధ్రజ్యోతి) : గూడూరు అబ్దుల్ కలాం వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ముయ్యబోయిన వెంకన్న, ప్రధాన కార్యదర్శిగా ముక్తవరం సత్యనారాయణ, కోశాధికారిగా బత్తుల శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా మండల వెంకటేశ్వర్లు, ఊకె లక్ష్మయ్య, సహాయ కార్యదర్శి నూనావత్ వీరన్న, క్రీడా కార్యదర్శి పెనక ప్రభాకర్, ప్రచార కార్యదర్శిగా వాంకుడోతు గోపినాథ్, గౌరవ అధ్యక్షులుగా ఎండీ ఖాసీం, వాంకుడోతు కొమ్మాలు, గౌరవ సలహాదారులుగా కన్న వెంకటేశ్వర్లు, సంగెపు స్వామి, బీరం వెంకట్‌రెడ్డి, ఐలబోయిన వీరయ్య, బుర్రి కొమురయ్య, భట్టు సారయ్య,ముంజాల పూర్ణచందర్, పేరాల రాము, కార్యవర్గ సభ్యులుగా గజ్జి మల్లయ్య, వద్దూరి రాజలింగాచారి, సయ్యద్ కరీం, సీహెచ్.దేవేందర్‌రావు, బెజ్జం రమేష్, మడిపెద్ది భాస్కర్‌ను ఎన్నుకున్నారు. తమ ఎన్నికకు సహకరించిన వాకర్స్‌కు నూతన అధ్యక్ష, కార్యదర్శులు ముయ్యబోయిన వెంకన్న, ముక్తవరం సత్యనారాయణలు కృతజ్ఞతలు తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



వెంకన్న (ఫైల్)

కేసముద్రం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : మద్యానికి బానిసై ఆర్థిక ఇబ్బందులు, అప్పుల బాధలు భరించలేక గడ్డి నివారణ మందు తాగి కేసముద్రం మండలం భూక్యరాంతండాలో ఆదివారం బానోత్ వెంకన్న(40) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ కె.క్రాంతికిరణ్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన ప్రకారం...వెంకన్న మద్యానికి బానిసై ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ అప్పులు చేసినట్లు తెలిపారు. ఈ అప్పుల బాధలు భరించలేక ఉదయం తన చెల్క వద్ద గడ్డిమందు తాగగా కుటుంబ సభ్యులు గుర్తించి 108లో మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో మృతి చెందాడు. మృతునికి భార్య మమత, కుమారుడు తరుణ్, కూతురు అంకిత ఉన్నారు. మృతుని తండ్రి తేజ్యా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కార్మికుడి మృతదేహానికి సీఐటీయూ నివాళి

ఇనుగుర్తి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఇనుగుర్తిలో ఆదివారం హమాలీ కార్మికుడు జడల సోమయ్య అనారోగ్యంతో మరణించగా ఆయన మృతదేహానికి సీఐటీయూ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి గొడిశాల వెంకన్న మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా సీఐటీయూ నాయకునిగా సోమయ్య కొనసాగుతున్నారని, ఆయన మృతి సంఘానికి తీరనిలోటని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి జల్లె జయరాజు, చాగంటి కిషన్, సోమారపు ఎల్లయ్య పాల్గొన్నారు.

కుమరం భీం పోరాట స్ఫూర్తితో ఉద్యమిద్దాం



బయ్యారంలో కుమరం భీం విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆదివాసీలు

బయ్యారం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఆదివాసీల ఆరాధ్య దైవం కుమరం భీం చేపట్టిన పోరాట స్ఫూర్తితో నేటి యువత హక్కుల సాధనకు ఉద్యమించాలని తెలంగాణ ఆదివాసీ తుడుందెబ్బ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ ఈసం నరసింహారావు పిలుపునిచ్చారు. కుమరం భీం వర్ధంతి సందర్భంగా ఆదివారం బయ్యారంలోని ఆయన విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. కుమరం భీం ఆశయ సాధన కోసం ఆదివాసీలందరూ కలిసికట్టుగా పోరాడాలన్నారు. ఆదివాసీల హక్కుల కోసం, ప్రజల విముక్తి కోసం ఆదివాసీ 12 గుడాలను ఏకం చేసి నిజాం ప్రభుత్వం నుంచి తమ తెగకు ప్రత్యేక గోండ్ రాజ్యం స్థాపన కుమరం భీం పోరాడినట్లు పేర్కొన్నారు. సంఘం రాష్ట్ర నాయకులు కోటయ్య, పద్మ, అడ్వకేట్ ఫోరం రాష్ట్ర నాయకులు పాపారావు, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు నర్సింగారావు పాల్గొని ప్రసంగించారు.

● గూడూరు : మండల కేంద్రంలో కుమరం భీం వర్ధంతిని తుడుందెబ్బ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈసందర్భంగా తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు ఈసం సుధాకర్ మాట్లాడారు. జల్.. జంగిల్.. జమీన్ నినాదంతో నైజాంకు వ్యతిరేకంగా ఆదివాసీ హక్కుల కోసం కుమరం భీం విరోచిత పోరాటం చేసినట్లు చెప్పారు. కుమరం భీం పోరాట చరిత్రను ఆదివాసీ యువతీ, యువకులు చదవాలని కోరారు. తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి పడిగే నాగేశ్వర్‌రావు, జిల్లా అధ్యక్షుడు బొల్లి సారయ్య, ఉద్యోగుల సంఘం నాయకులు వెంకన్న, లింగాల కిరణ్, జక్క లక్ష్మయ్య, రేగ రమేష్, సునీల్, మల్లేష్, శ్రీను, సురేందర్, ప్రవీణ్, పాపారావు, కార్తీక్, సందీప్, మధు పాల్గొన్నారు.

'బీసీ బంద్‌ను విజయవంతం చేయాలి'



మాట్లాడుతున్న యాదవ సంఘం రాష్ట్ర నాయకుడు సూత్రపు రాజు

గార్ల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు బీసీ రిజర్వేషన్లపై స్పష్టత ఇవ్వాలని కోరుతూ ఈనెల 14న బీసీ జాక్ చేపట్టిన రాష్ట్ర బంద్‌ను బీసీ వర్గాల ప్రజలు సంపూర్ణ మద్దతూ తెలిపి విజయవంతం చేయాలని యాదవ సంఘం రాష్ట్ర నాయకుడు సూత్రపు రాజుయాదవ్ కోరారు. ఈ నెల 14న బీసీ బంద్ విజయవంతం కోరుతూ ఆదివారం స్థానిక అంబేద్కర్ భవనంలో బీసీ సంఘాల రౌండ్ టేబల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. నూతనంగా ప్రకటించిన రిజర్వేషన్లు బీసీ కులాలకు తీరని నష్టంజరిగిందని దీన్ని రాష్ట్ర ప్రభుత్వం సవరించాలన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గతంలో బీసీలకు కేటాయించబడిన సీట్లు సైతం ఎస్టీలకు ప్రకటించడంతో బీసీ అన్యాయం జరిగిందన్నారు. ఈ సమావేశంలో శీలంశెట్టి రమేష్, రెడ్డి మల్ల ఉమేష్, సాగర్, కోట ఉత్తరయ్య, అగాల రామారావు, జంపాల వెంకన్న పాల్గొన్నారు.

ఎస్టీ నియోజకవర్గంగా ఏర్పాటు చేయాలి



అభివాదం చేస్తున్న ఆదివాసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు

గూడూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : గూడూరును ఎస్టీ నియోజకవర్గంగా ఏర్పాటు చేయాలని ఆదివాసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు మూతి బద్రి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గూడూరు శివారు కొమరం భీం కాలనీలో ఆదివారం ఆదివాసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఈసం రమేష్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బద్రి మాట్లాడుతూ గూడూరు గతంలో తాలూకా కేంద్రంగా, సమితిగా ఉండేదన్నారు. అట్టి గూడూరును కొత్తగూడ, గంగారం, బయ్యారం, ఏజెన్సీ మండలాలను కలుపుతూ.. డిలిమిటేషన్‌లో భాగంగా ఎస్టీ నియోజకవర్గంగా ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఐలబోయిన వీరయ్య, పెనక ప్రభాకర్, బత్తుల శ్రీనివాస్, ముయ్యబోయిన వెంకన్న, మద్దెల రమేష్, కాక నర్సయ్య, ఐలబోయిన సమ్మక్క పాల్గొన్నారు.

'జ్ఞానానికి, అజ్ఞానికి మధ్య తేడా తెలిపేదే సైన్స్'

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : జ్ఞానానికి, అజ్ఞానానికి తేడా తెలిపేదే సైన్స్ అని జన విజ్ఞాన వేదిక (జేవీవీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజారాజా అన్నారు. మహబూబాబాద్‌లో ఆదివారం జేవీవీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా 5వ వార్షిక సమావేశం జిల్లా అధ్యక్షుడు సాహితీ శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాజా రాజా మాట్లాడారు. నేటి ఆధునిక సమాజంలో జ్ఞానం అనేక రకాలుగా విస్తరిస్తుందని, కులం, మతం, ప్రాంతం, భాషభేదాలు ఇవేమి శాస్త్ర ప్రచారానికి అడ్డు కాదన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వాటి పేరిట అజ్ఞానాన్ని జ్ఞానంగా ప్రచారం జరుగుతుందన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు అలువాల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ విద్యావ్యవస్థలో పలు మార్పులు చోటు చేసుకున్నాయని, సిలబస్ అంశాలను పూర్తిగా మార్చుతున్నారన్నారు. అనంతరం చొప్పరి శ్రీనివాస్, సునితలు వార్షిక నివేదికలు సమర్పించారు. దయానంద్, మంగపతిరావు, వెంకట్రాంనర్సయ్య, యాకాంతంగౌడ్, మల్లారెడ్డి, యాకూబ్, ఉప్పల శ్రీనివాస్, విజయ్‌రాజ్, సునిత, యాదగిరి, మోహనకృష్ణ, ప్రసాద్, కృష్ణప్రసాద్, యాకన్న, సంపత్, రాజేశ్వర్ రావు, సాధ్విమని, దుర్గాలక్ష్మీ, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.



మెడికల్ క్యాంపులో మాట్లాడుతున్న మాధవపెద్ది వెంకట్‌రెడ్డి

వ్యాయామం, వైద్యుల సూచనలతో ఒత్తిడిని అధిగమించవచ్చు

● లయన్స్‌క్లబ్ జోన్ చైర్మన్ మాధవపెద్ది వెంకట్‌రెడ్డి

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : అనునిత్యం జీవన విధానంలో చోటు చేసుకుంటున్న మార్పులతో ప్రతి ఒక్కరు మానసిక ఆందోళనకు గురవుతున్నారని వ్యాయామం, వైద్యుల సూచనలతో ఒత్తిడిని అధిగమించవవచ్చని లయన్స్‌క్లబ్ జోన్ చైర్మన్ మాధవపెద్ది వెంకట్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం మెడికల్ స్క్రీనింగ్ క్యాంపును ఆదివారం నిర్వహించారు. బీపీ, షుగర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ మానసిక, శారీరక ఒత్తిడితో హైపర్ టెన్షన్, మధుమోహం వంటి వ్యాధులు వచ్చే ప్రమాదముందని వాటిని నివారించడానికి ప్రతి రోజు వ్యాయామం చేయడంతో పాటు వైద్యులు సలహాలు, సూచనలు పాటించాలన్నారు. క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ బి.వీరన్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ దేవిరెడ్డి, పర్కాల రవీందర్‌రెడ్డి, బవిరిశెట్టి నాగేశ్వర్‌రావు, చౌడవరపు సుధాకర్, రమేష్ బాబు, మాలె కాశీనాథ్, సురేష్‌బాబు, ఆకుల రాజు, దేవేందర్‌రావు, మోహన్‌రెడ్డి, శరత్‌కుమార్, ఆకుల శంభయ్య, తండా సదానందం, బానోత్ శారద, పమ్మి వసంత పాల్గొన్నారు.

సమష్టి కృషితో సామాజిక సేవలు విస్తృతం

● కాళోజీ వాకర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు డోలి సత్యనారాయణ

మహబూబాబాద్ రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : సభ్యుల సహకారం, సమిష్టి కృషితోనే సామాజిక సేవలను విస్తృత పరుస్తున్నామని కాళోజీ వాకర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు డోలి సత్యనారాయణ అన్నారు. కంబాలపల్లి పెద్ద చెరువు వద్ద కాళోజీ వాకర్స్ అసోసియేషన్ వార్షిక సమావేశాన్ని ఆదివారం నామిరెడ్డి వెంకట్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ప్రధాన కార్యదర్శి పట్టాభి లక్ష్మయ్య వార్షిక నివేదికను, కోశాధికారి సోమ విష్ణువర్దన్ ఆర్థిక నివేదికను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాళోజీ వాకర్స్ అసోసియేషన్‌ను 2012లో ప్రారంభించామని, నాటి నుంచి నేటి వరకు ఆరోగ్యాలను కాపాడుకోవడం కోసం అనేక అవగాహన కార్యక్రమాలతో పాటు సామాజిక సేవలు చేపడుతూ రాష్ట్రస్థాయిలో ఉత్తమ వాకర్స్ అసోసియేషన్‌గా గుర్తింపు పొందినట్లు తెలిపారు. ఇకముందు కూడా కాళోజీ నారాయణరావు స్ఫూర్తితో సామాజిక అభివృద్ధి తమ వంతు బాధ్యతగా సేవలను మరింత విస్తృత పరుస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గౌరవ సలహాదారులు మైన నాగయ్య, గూడూరు నాగేశ్వర్‌రావు, హట్యానాయక్, పెద్ది వెంకన్న, కోట సుధాకర్, పరామత్మాచారి, శ్రీరాములు, వెంకన్న, వీరన్న, శ్రీనివాస్‌రెడ్డి, గోనె శ్యాంరావు, మధుసూదన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, రాచకొండ ఉపేందర్, దేవ్‌సింగ్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

టైం స్కేల్ ఉద్యోగుల హక్కుల కోసం పోరాడుతాం



ఉద్యోగులతో మాట్లాడుతున్న అజయ్‌సారథిరెడ్డి

● ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజయ్‌సారథిరెడ్డి

మహబూబాబాద్ అగ్రికల్చర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : మల్యాలలోని హెచ్‌ఆర్ఎస్ టైంస్కేల్ ఉద్యోగుల హక్కుల కోసం పోరాడుతామని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బి.అజయ్‌సారథిరెడ్డి అన్నారు. మహబూబాబాద్ మండలం మల్యాలలోని హెచ్‌ఆర్ఎస్‌లో టైంస్కేల్ ఉద్యోగుల, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌ఆర్ఎస్ టైం స్కేల్ ఉద్యోగుల, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పదవీవిరమణ బెనిఫిట్స్ రూ.7.50 లక్షలకు పెంచాలని, పదవీవిరమణ వయస్సు 61 ఏళ్లకు పెంచాలన్నారు. టైం స్కేల్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఉద్యోగుల గ్రాట్‌విటీ రూ.3 లక్షలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలకై ఈ నెల 16, 17 తేదీల్లో ఆందోళన కార్యక్రమాలను, 24న ఛలో సిద్దిపేట కొండ లక్ష్మణ్ బాపూజీ యూనివర్సిటీలో జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రేషపల్లి నవీన్, వెలుగు శ్రావణ్, పెరుగుకుమార్, చింతకుంట్ల వెంకన్న, లింగ్యానాయక్, ప్రవీన్, అమీర్, శ్రీరాములు, హుస్సేన్, ఇమామ్, చింతకాయల వెంకన్న, ఎల్లయ్య, సూరయ్య, షరీఫ్, ఉపేందర్, సుమన్, యాకమ్మ పాల్గొన్నారు.



మరిపెడ దగ్గర బోల్తా పడిన వ్యాన్

వ్యాన్ బోల్తా : 10 మందికి గాయాలు

● కురవి వీరభద్రస్వామి టెంపుల్‌కు వెళ్తుండగా మరిపెడ దగ్గర ఘటన

● ఇద్దరి పరిస్థితి విషమం

మరిపెడ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : వ్యాన్ బోల్తాపడి పదిమందికి పైగా గాయపడ్డ సంఘటన ఆదివారం రాత్రి మహబూబాబాద్ జిల్లా మరిపెడ బంగ్లా సమీపంలోని అయ్యప్పస్వామి ఆలయం దగ్గర ఎన్‌హెచ్‌ఏ 563పై చోటు చేసుకుంది. అందులో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు మరిపెడ పోలీసులు పేర్కొన్నారు. హైదరాబాద్ సీతాఫల్‌మండీకి చెందిన ఓ కుటుంబం తమ మనవడి పుట్టు వెంట్రుకల మొక్కులు చెల్లించడానికి కురవి టెంపుల్‌కు వెళ్తతుండగా ఈ ఘటన జరిగింది. ఆ టెంపోలో మొత్తం 25 మంది ప్రయాణిస్తున్నారు. ఆదివారం రాత్రి మరిపెడలో భారీగా కురిసిన వర్షంతో 563 హైవేపై ఇటీవల ఏర్పడిన గుంతలను గమనించక వ్యాన్ డ్రైవర్ అదే స్పీడ్‌తో ఆ టెంపోను వేగంగా నడవడంతో ఆ గుంతల వద్ద ఆ వాహనం అదుపుతప్పి పల్టీ కొట్టింది. ఇందులో ప్రయాణిస్తున్న ఇరువైఐదు మందిలో పదిమందికి పైగా గాయపడ్డారని తెలుస్తుంది. మరిపెడ అదనపు ఎస్సై కోటేశ్వర్ రావు తన సిబ్బందితో అక్కడికి చేరుకొని క్షతగాత్రులను మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి, స్థానిక పీహెచ్‌సీకి 108 వాహనంలో కొందరిని చికిత్స కోసం తరలించారు. ఆ విషాద సంఘటనతో తేరుకోలేని బాధితులు పూర్తి వివరాలు వెల్లడించకపోవడంతో క్షతగాత్రుల వివరాలు ఇంకా పూర్తిగా తెలియాల్సి ఉంది.

వరంగల్ సిటీకి త్వరలో వంద ఎలక్ట్రిక్ బస్సులు

● ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలే లక్ష్యం

● ఆర్టీసీ సంస్థ ఎండీ వైవీ నాగిరెడ్డి

● వరంగల్ రీజినల్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష

హనుమకొండ టౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ వరంగల్ రీజియన్ పరధిలోని వరంగల్ నగరానికి త్వరలో వంద ఎలక్ట్రిక్ బస్సులు వస్తున్నట్లు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వైవీ నాగిరెడ్డి తెలిపారు. ఆదివారం హనుమకొండలోని వరంగల్ రీజినల్ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వరంగల్ రీజియన్‌కు తొలిసారిగా వచ్చిన ఆయనకు.. ఆర్ఎం డి.విజయభాను శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం వరంగల్-1 డిపో ప్రాంగణంలో మొక్కలు నాటి నీరు పోశారు. ప్రగతి చక్ర అవార్డు కార్యక్రమంలో పాల్గొని ఉత్తమ సేవలందించిన సిబ్బందిని సత్కరించారు. హనుమకొండ బస్టాండ్ ప్రాంగణాన్ని పరిశీలించి అవసరమైన సదుపాయాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వైవీ నాగిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో 9,800 బస్సులు, 40 వేల మంది ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది పనిచేస్తున్నారని అన్నారు. ప్రతీరోజు 60లక్షల మంది ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చుతున్నట్లు తెలిపారు. వరంగల్ రీజినల్ పరిధిలో వెయ్యి బస్సులు నడుపుతున్నామని, రోజుకు 4 లక్షల మంది ప్రయాణికులకు సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చుతున్నట్లు తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీకి ఆదాయం పె రుగుతోందని, ప్రభుత్వం ఒక పద్ధతి ప్రకారం నిధులు ఇస్తోందని తెలిపారు. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కోసం ప్రతీ డిపోలో మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రస్తుతం బస్సు చార్జీలు పెంచామని అన్నారు. ప్రయాణికులకు సౌకర్యాలు మెరుగు పర్చడం ఆర్టీసీ ప్రధాన లక్ష్యమని నాగిరెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.సోలమాన్, వరంగల్ ఆర్ఎం డి.విజయభాను, డిప్యూటీ ఆర్ఎంలు భానుకిరణ్, మహేష్, అధికారులు రవీందర్, సైదులు, డిపోల మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.



వరంగల్ -1 డిపోలో మొక్క నాటుతున్న నాగిరెడ్డి